సాక్షి మహబూబ్‌నగర్
మంగళవారం | 30 | మే | 2023



..నిజమైన దేశభక్తి

సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన దేశభక్తి అని ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ అన్నారు.

వివరాలు 8లో ▸



దద్దరిల్లిన కందనూలు

వడ్లు కొనుగోలు చేయాలని జూపల్లి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నా చేపట్టారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
42.8 /24.9

ఉదయం నుంచి ఎండ తీవ్రత ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై తేలిక పాటి వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



జడ్చర్ల: రోడ్లపై ప్రయాణం చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కె.నరసింహ అన్నారు. సోమవారం ఆయన జడ్చర్ల శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై కొత్త బస్టాండ్ సమీపంలో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఏర్పాటు చేసిన డివైడర్ రేలింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులకు సూచనలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడాలని ఆదేశించారు. బ్లాక్ స్పాట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐ రమేశ్‌బాబు, ఎస్‌ఐ లెనిన్ తదితరులున్నారు.

31న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు

మహబూబ్‌నగర్ క్రీడలు: వచ్చే నెలలో ప్రారంభమయ్యే హెచ్‌సీఏ టూడేస్ లీగ్‌లో పాల్గొనే అండర్-25 ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలు బుధవారం జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలో క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఒరిజనల్ ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రం, రెండు పాస్‌పోర్టు ఫొటోలతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. క్రీడాకారులు వైట్ డ్రెస్, వైట్ షూస్, సొంత కిట్‌తో ఎంపికల్లో పాల్గొనాలని ఆయన సూచించారు.

ఉత్సవాల నిర్వహణ కమిటీల ఏర్పాటు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): దశాబ్ది ఉత్సవాల నిర్వహణను జిల్లా, నియోజకవర్గ స్థాయి కమిటీలు పకడ్బందీగా పర్యవేక్షించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. 2న నిర్వహించనున్న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు మొదలుకొని 22 వరకు చేపట్టే కార్యక్రమాలపై అన్నిస్థాయిల్లో అప్రమత్తం చేయాలన్నారు. ఏర్పాట్లు, నిర్వహణలో ఎలాంటి లోపం ఉండకూడదని, ఆ దిశగా ముందు నుంచే అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. జిల్లాస్థాయి కమిటీ అన్ని కార్యక్రమాలను పర్యవేక్షించాలని, నియోజకవర్గాల కమిటీలు వారి స్థాయిలో నిర్వహించే కార్యక్రమాలపై దృష్టిసారించాలన్నారు. ముందుగా రైతు దినోత్సవం 3న ఉన్నందున వెంటనే ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సీతారామారావు, జిల్లాస్థాయి కమిటీ సభ్యులు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్, హౌసింగ్ ఈఈ భాస్కర్, డీపీఆర్‌ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీఓ అనిల్‌కుమార్, సీపీఓ దశరథం, జిల్లా కోఆపరేటివ్ ఆఫీసర్ సుధాకర్, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, జెడ్పీసీఈఓ జ్యోతి, ఫిషరీస్ ఏడీ రాధారోహిణి, జీఎండీఐసీ బాబురావు, హార్టికల్చర్ డీడీ సాయిబాబా, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్ మహ్మద్ హుస్సేన్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జరీనా బేగం, దేవరకద్ర తహసీల్దార్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంతర్మథనం..!

పట్టుకోల్పోతున్న రెవెన్యూ శాఖ

- ఒక్కొక్కటిగా విడిపోతున్న మూల స్తంభాలు
- మొన్న వీఆర్‌ఓలు, నేడు వీఆర్‌ఏలు
- క్రమబద్ధీకరిస్తూ ఇతర శాఖల్లో సర్దుబాటుకు కసరత్తు
- క్షేత్రస్థాయిలో సవాల్ విసురుతున్న సమస్యలు



మహబూబ్‌నగర్ న్యూటౌన్: భూ రికార్డుల ప్రక్షాళన, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, ధరణి పోర్టల్ వంటి ఎన్నో సంస్కరణలకు వేదికైన రెవెన్యూ శాఖ పట్టుకోల్పోతోంది. కీలక ఉద్యోగులను ఆ శాఖ నుంచి దూరం చేసే నిర్ణయం తీవ్ర ప్రభావం చూపనుంది. పెరిగిపోతున్న భూ సమస్యలు, ఫిర్యాదులు, దరఖాస్తులు ఆ శాఖకు సవాల్ విసురుతున్నాయి. క్షేత్రస్థాయిలో రెవెన్యూ శాఖకు మూలస్తంభాలైన వీఆర్‌ఓ, వీఆర్‌ఏలను ఆ శాఖ నుంచి దూరం చేసే ప్రక్రియ ప్రారంభం కావడంతో రెవెన్యూ వర్గాలను అంతర్మథనంలో పడేసింది. ఇప్పటికే గ్రామస్థాయిలో పనిచేస్తున్న వీఆర్‌ఓలను మూడేళ్ల క్రితం తొలగించి దాదాపు రెండేళ్ల అనంతరం ఇతరశాఖల్లో సర్దుబాటు చేయగా.. తాజాగా వీఆర్‌ఏలను సైతం క్రమబద్ధీకరిస్తూ ఇతర శాఖల్లో సర్దుబాటు చేయాలనే నిర్ణయం రెవెన్యూ వర్గాలను కలవరానికి గురిచేసింది. వీఆర్‌ఓ వ్యవస్థ రద్దుతో ఇప్పటికే పనిభారంతో ఇబ్బందులు పడుతున్న తహసీల్దార్ కార్యాలయాలు వీఆర్‌ఏలను సైతం ఇతర శాఖలకు పంపిస్తే పరిస్థితి ఏంటనేది తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. గతంలో వీఆర్‌ఓల తొలగింపుతో వారి పనులన్నీ వీఆర్‌ఏలే నిర్వర్తించారు. మూడేళ్ల పాటు ఆ భారం మోసిన వీఆర్‌ఓలను తాజాగా ప్రభుత్వం ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తే ఆ విధులు ఎవరు నిర్వర్తిస్తారన్నది వారిని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. ఒకవైపు భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లు, దరఖాస్తుల పరిష్కారం, విచారణ వంటి పనుల ఒత్తిడి తీవ్రంగా ఉండటం.. తాజాగా కీలక విధుల్లో ఉన్న వీఆర్‌ఏలను ఇతర శాఖలకు పంపే నిర్ణయంతో మూలిగేనక్కపై తాటికాయపడ్డట్లు రెవెన్యూ శాఖ పరిస్థితి తయారైందనే చెప్పాలి.

ప్రభుత్వానికి నివేదించాం..



గతంలో వీఆర్‌ఓలను తొలగించడంతో పనిభారం పెరిగింది. క్షేత్రస్థాయిలో ఉన్న వీఆర్‌ఏల ద్వారా ఇప్పటి వరకు నెట్టుకొచ్చిన పరిస్థితి. తాజాగా వీఆర్‌ఏలను సైతం ఇతర శాఖలకు సర్దుబాటు చేస్తామని ప్రభుత్వం నిర్ణయించింది. అదే జరిగితే తహసీల్దార్ కార్యాలయాలు పని ఒత్తిడితో ఇబ్బందులు పడతాయి. రెవెన్యూ అసోసియేషన్ తరఫున వీఆర్‌ఏలను రెవెన్యూ శాఖలోనే ఉంచాలని ప్రభుత్వానికి నివేదించాం.

– శ్రీనివాసులు, రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు

పెరగనున్న ఒత్తిడి..

వివిధ ప్రభుత్వ పథకాల అమలు, కేసుల విచారణ , పంచనామాలు, కుల, ఆదాయం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ దరఖాస్తుల పరిశీలనతో పాటు నోటీసుల జారీ, ఇతర భూ సంబంధిత సమస్యలు వంటి ఎన్నో రకాల పని ఒత్తిళ్లు పెరగనున్నాయి. వీఆర్‌ఓ, వీఆర్‌ఏల తొలగింపు అంశం రెవెన్యూ శాఖలోని అధికారులను కంటిమీద కునుకులేకుండా చేస్తుండగా.. మరోదిక్కు సమస్యలు సకాలంలో పరిష్కారం కాక తహసీల్దార్ కార్యాలయాలకు వచ్చే ప్రజల తాకిడి మరింత పెరగనుంది.

కసరత్తు వేగవంతం

వీఆర్‌ఏల క్రమబద్ధీకరణ కసరత్తును ప్రభుత్వం వేగవంతం చేసింది. వీఆర్‌ఏల వివరాలను తక్షణమే పంపాలని సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు రావడంతో ఆయా మండలాల తహసీల్దార్లు వివరాల సేకరణపై దృష్టిసారించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 430 మంది వీఆర్‌ఏలు ఉండగా అందులో 140 మంది డైరెక్టు రిక్రూట్‌మెంట్ ఉన్నారు. వీరందరి ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తూ ఇతర శాఖలైన నీటిపారుదల, మున్సిపల్, పీఆర్, విద్య, వైద్య, వైద్య కళాశాలల్లో సర్దుబాటు చేసి వారికి భవిష్యత్‌లో పదోన్నతులు వచ్చేలా చూడాలని భావిస్తోంది.

వేరుశనగ @ రూ.7,196

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.7,196, కనిష్టంగా రూ.5,808 ధరలు లభించాయి. అదేవిధంగా మొక్కజొన్నకు గరిష్టంగా రూ.1,818, కనిష్టంగా రూ.1,201, ఆముదాలకు గరిష్టంగా రూ.5,435, కనిష్టంగా రూ.5,251, హంసకు గరిష్టంగా రూ.1,827, కనిష్టంగా రూ.1,202, ఆర్ఎన్ఆర్‌కు రూ.2,289 పలికింది.

అప్పుల తెలంగాణగా మార్చారు



తాడూరులో మహిళా కూలీలతో ముచ్చటిస్తున్న మల్లు భట్టి విక్రమార్క

- పిల్ల కాల్వలను తవ్వలేని దుస్థితిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- సాగునీరు అందించే బాధ్యత ఎమ్మెల్యేకు లేదా?
- కాంగ్రెస్ ప్రభుత్వంలో స్వేచ్ఛగా బతుకుదాం
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క

నాగర్‌కర్నూల్ రూరల్/ తాడూరు: రాష్ట్ర ఏర్పాటు సమయంలో మిగులు బడ్జెట్‌తో తెలంగాణను అప్పుల ఊబిలోకి నెట్టారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. పీపుల్స్ మార్చ్‌లో భాగంగా సోమవారం మండలంలోని గగ్గలపల్లి, మంతటి చౌరస్తా, మంతటి, దేశిటిక్యాలలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఏ లక్ష్యంతో తెలంగాణ ఏర్పడిందో వాటికి దూరంగా నెట్టబడిందని విమర్శించారు. అప్పటి కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన భూములను కేసీఆర్ ప్రభుత్వం బలవంతంగా గుంజుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ గుంజుకున్న పేదల భూములను తిరిగి పేదలకే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలకు సాగునీరు అందించే పిల్ల కాల్వలను కూడా తవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఫలితంగా గగ్గపల్లిలోనే 2,500 ఎకరాలకుపైగా పంటలు ఎండిపోయాయని గుర్తుచేశారు. తక్షణమే పిల్ల కాల్వలను తవ్వి బీడు భూములను సాగునీరందించాలని డిమాండ్ చేశారు. సాగునీరు అందించే బాధ్యత ఎమ్మెల్యేకు లేదా అని ప్రశ్నించారు. మరోదిక్కు రైతులు రోడ్ల వెంబడి ధాన్యం కుప్పలుగా పోసుకుని అమ్మేందుకు నిరీక్షిస్తున్నా.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చుకొని ఇందిరమ్మ రాజ్యంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో బతుకుదామని భరోసా ఇచ్చారు.

నా బిడ్డను చంపేశారు..

అంతకు ముందు తాడూరుకు చెందిన వస్పరి ఎల్లమ్మ భర్త పర్వతాలు వచ్చి తన బిడ్డను చంపేశారని, ఇచ్చిన భూమిలోకి తమను వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వడం లేదని భట్టి ఎదుట వాపోయారు. స్థానిక ఎమ్మెల్యే నిందితులకు అండగా ఉన్నారని, తమను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. ఉపాధి కూలీలు తమకు మూడు నెలలకు ఒకసారి డబ్బులు ఇస్తున్నారని, డబ్బుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అర్థం రవి, పాండు, లక్ష్మయ్య, భగవంతురెడ్డి పాల్గొన్నారు.

సమష్టి కృషితో దశాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, పక్కన జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి, కలెక్టర్లు రవినాయక్, శ్రీహర్ష, ఎమ్మెల్యేలు ఎస్ఆర్ రెడ్డి, పట్నం నరేందర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- జూన్ 2 నుంచి 22 వరకు కార్యక్రమాల నిర్వహణ
- ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో విజయవంతం చేద్దాం
- మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో ఏర్పాట్లపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దామని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా నాటి ఉద్యమ నేత, సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు జూన్ 2 నుంచి 22 వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ తొమ్మిదేళ్లలో తెలంగాణ సాధించిన విజయాలను ప్రతిఒక్కరికి తెలియజెప్పేలా ఉత్సవాలు జరిపించాలన్నారు. 2014కు పూర్వం.. 2014 తర్వాత తెలంగాణను కళ్లకు కట్టినట్టుగా ప్రజలందరికీ తెలియజేసే బాధ్యత ప్రజాప్రతినిధులతో పాటు, అధికారులందరిపై ఉందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు అందరి సహకారంతో ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ప్రధానంగా ఉత్సవాలను అధికారులు తమదిగా భావించి.. అందరూ హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలని, బాగా పనిచేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు సన్మానిస్తామని, అన్ని కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, సంబంధిత ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సమ్మతితో కార్యక్రమాలను నిర్వహించాలని, అన్ని శాఖలు గత తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని నివేదికల రూపంలో తయారు చేయాలని ఆదేశించారు.

- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను జిల్లాలో విజయవంతం చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ రవినాయక్ సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇచ్చిన సూచనలు, ఆదేశాలను వివరించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులందరు భాగస్వాములు కావాలని, జూన్ 2న ఉదయం 9 గంటలకు సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ జాతీయ పతాకాన్ని ఎగరవేస్తారని, అంతకుముందు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారని చెప్పారు. ఆయా తేదీల్లో నిర్వహించనున్న కార్యక్రమాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఇది వరకే ఆదేశించామన్నారు. నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల్లో అధికారులతోపాటు ప్రజాప్రతినిధులను సైతం భాగస్వామ్యం చేయాలని సూచించారు.

- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సాధించిన విజయాలను ప్రజలందరికీ తెలిసేలా చెప్పాల్సిన అవసరం ఉందని, తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని, ఇందుకుగాను అధికారులందరూ పూర్తిగా సహకరించాలని కోరారు.
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇన్ని రోజులు చేసిన పనిని గొప్పగా చెప్పుకొనేందుకు ఇది చక్కటి అవకాశంగా మార్చుకోవాలని, అలాగే ఈ ఉత్సవాలు ప్రజాప్రతినిధులకు మంచి అవకాశం అన్నారు.
- కొడంగల్ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ 9 ఏళ్ల అభివృద్ధిని చాటేలా అన్ని గ్రామాలు, పట్టణాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నారాయణపేట జెడ్పీ చైర్‌పర్సన్ వనజ, గిరిజన కార్పొరేషన్ చైర్మన్ వాల్యానాయక్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఇంతియాజ్, ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్లు సీతారామారావు, మయాంక్ మిట్టల్, ఏఎస్పీ నాగేంద్రుడు, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, డీసీసీబీ ఇన్‌చార్జ్ చైర్మన్ వెంకటయ్య, ముడా చైర్మన్ గంజి వెంకన్న, మున్సిపల్ చైర్‌పర్సన్లు నర్సింహులు, బస్వరాజు, లక్ష్మి పాల్గొన్నారు.

ధాన్యం.. వర్షార్పణం



నవాబుపేట మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యం బస్తాలు

జడ్చర్ల/నవాబుపేట: జడ్చర్ల మండలంలోని పెద్ద ఆదిరాలలో సోమవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి భారీ ఎత్తున ధాన్యం తడిసి ముద్దయ్యింది. రైతువేదిక వద్ద విక్రయించేందుకు పక్షం రోజులుగా రైతులు తమ ధాన్యం తీసుకువచ్చారు. అయితే ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినా ధాన్యం తరలించేందుకు లారీలను ఏర్పాటు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో ఒక్కసారిగా వర్షం రావడంతో 4 వేల బస్తాలు తడిసోయిందని రైతులు ఆరోపించారు. అలాగే నవాబుపేట మండలంలోని లింగంపల్లి, కారుకొండ, లోకిరేవు, కొల్లూర్, చౌడూర్, కొండాపూర్, కాకర్లపహాడ్ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లోనూ దాదాపు 2 వేల బస్తాల ధాన్యం తడిసింది. వ్యాపారులు ధాన్యం టెండర్లలో ఆలస్యం చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని రైతులు వాపోయారు.

ఎలా ఉన్నా కొనాలి..



కొనుగోలు కేంద్రానికి ధాన్యం తెచ్చి వారం రోజులైంది. ఇప్పుడు వర్షం కురవడంతో ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించిన ప్రభుత్వమే ఇందుకు బాధ్యత వహిస్తూ ఎలా ఉన్నా ధాన్యం కొనాలి. మిల్లర్లు సైతం ధాన్యం సేకరణలో తీవ్రమైన అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

– యాదయ్య, లింగంపల్లి





జడ్చర్ల మండలం పెద్దఆదిరాల కేంద్రంలో తడిసిన ధాన్యం, నవాబుపేట మండలం లింగంపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

పల్లె, బస్తీ దవాఖానాలతో మెరుగుపడనున్న సేవలు

- శాశ్వత భవనాల నిర్మాణాలకు వైద్యశాఖ కసరత్తు
- గ్రామస్థాయిలోనూ బలోపేతానికి చర్యలు
- నేడు రెండు బస్తీ దవాఖానాలు ప్రారంభం
- జనరల్, సివిల్ ఆస్పత్రులకు తగ్గనున్న రోగుల తాకిడి

స్థానికంగానే వైద్యం



జిల్లాకేంద్రంలోని టీడీగుట్టలో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానా

పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రితోపాటు ఇతర సివిల్ ఆస్పత్రుల్లో భారం తగ్గించేందుకు పట్టణాల్లో బస్తీ, గ్రామాల్లో పల్లె దవాఖానాలను విస్తృతంగా ఏర్పాటు చేసే దిశగా యంత్రాంగం అడుగులు వేస్తోంది. జిల్లా కేంద్రంలో జనాభాకు అనుగుణంగా కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. పాలమూరు పట్టణంతోపాటు పల్లెల్లో ఉండే పేదలకు ఆరోగ్య సేవలు మెరుగుపరిచేందుకు కసరత్తు జరుగుతుంది. జిల్లాలోని 441 గ్రామాల పరిధిలో ఏటా వ్యాధుల విజృంభణ కొనసాగుతోంది. దీంతో జనరల్, సివిల్ ఆస్పత్రులకు రాలేని వారి కోసం బస్తీ దవాఖానాల్లోనే వైద్యసేవలు అందించేందుకు ఆరోగ్య శాఖ దృష్టిపెట్టింది. జలుబు, దగ్గు, జ్వరం, ఒంటినొప్పులు, తేలికపాటి గాయాలు తదితర ఆరోగ్య సమస్యలకు స్థానికంగానే చికిత్స అందనుంది.

87 పల్లె దవాఖానాలు

జిల్లాలో ప్రస్తుతం 87 పల్లె దవాఖానాలు ఉండగా ఇందులో 22 ప్రభుత్వ భవనాల్లో, మిగిలిన 65 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో 50 శాశ్వత భవనాల నిర్మాణాలకు ఉత్తర్వులు జారీ చేసింది. 50 శాశ్వత భవనాల్లో 36 భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉండగా మరో 14 భవనాలకు టెండర్ వేయాల్సి ఉంది. 87 పల్లె దవాఖానాల్లో 79 మంది మెడికల్ ఆఫీసర్లు ఉండగా సోమవారం కొత్తగా మరో ముగ్గురిని విధుల్లోకి తీసుకున్నారు.

- గ్రామస్థాయిలో వైద్య సేవలు మరింత పటిష్టం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పల్లె దవాఖానాలు, సబ్ సెంటర్లను బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాకు కొత్తగా 50 సబ్ సెంటర్ భవనాలు మంజూరయ్యాయి. జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో పనిచేస్తున్న సబ్‌సెంటర్లు (వెల్‌నెస్) శాశ్వత భవనాలు నిర్మించడానికి కార్యాచరణ రూపొందించారు. సబ్ సెంటర్ల నిర్వహణ కోసం జిల్లావ్యాప్తంగా కొత్తగా 50 చోట్ల నూతన శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ఈ నిర్మాణ బాధ్యతలను పంచాయతీ రాజ్ శాఖకు అప్పగించారు. ఒక్కో సబ్‌సెంటర్ భవనం రూ.20 లక్షల వ్యయంతో 300 గజాల స్థలంలో నిర్మించాలని ప్రణాళిక తయారు చేయడం జరిగింది. ఇప్పటికే చాలా భవనాలకు స్థల సేకరణ చేయగా.. మిగతా చోట్ల కూడా వెంటనే పూర్తి చేసి భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని తహసీల్దార్లతోపాటు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా భవనాలు నిర్మించే వాటిలో బాలానగర్ పీహెచ్‌సీ పరిధిలో 4, రాజాపూర్ 2, నవాబ్‌పేట 3, గంగాపూర్ 11, మిడ్జిల్ 4, జానంపేట 6, భూత్పూర్ 6, మణికొండ 2, కోత్లాబాద్ 2, చిన్నచింతకుంట 4, పేరూర్ 3, అడ్డాకుల, దేవరకద్ర, మహమ్మదాబాద్‌లో ఒక్కొక్కటి చొప్పున నూతనంగా నిర్మించనున్నారు.

స్థానికంగానే వైద్యం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలోని వార్డుల్లో ఉండే పట్టణ జనాభాకు స్థానికంగానే వైద్యసేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం బస్తీ దవాఖానా సేవలను అందుబాటులో తీసుకువచ్చింది. పట్టణంలో ఇప్పటికే పాతపాలమూరు, ఏనుగొండలో తాత్కాలికంగా బస్తీ దవాఖానాలుండగా.. ఇటీవల కొత్తగా వీరన్నపేట, టీడీగుట్టలో శాశ్వత భవనాలు నిర్మించారు. ఈ రెండింటిని మంగళవారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. ఒక్కో భవనం రూ.13 లక్షలతో మరమ్మతు చేశారు. ఈ బస్తీ దవాఖానాల్లో ఒక వైద్యాధికారి, ఒక స్టాఫ్ నర్సు, ఒక సపోర్టింగ్ సిబ్బంది ఉంటారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓపీ చూడాల్సి ఉంటుంది. శనివారం సెలవు కాగా.. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓపీ సేవలు అందిస్తారు. ఒక్కో బస్తీ దవాఖానాలో ప్రతిరోజు 40 నుంచి 60 వరకు ఓపీ కేసులు చూడాలి. ఇక్కడ పరీక్షలు, ఇతర వైద్యసేవలు అందించి ఒకవేళ మెరుగైన వైద్యం అవసరమైతే జనరల్ ఆస్పత్రికి పంపాలి.

శాశ్వత భవనాలు నిర్మిస్తాం..

చిన్నపాటి సమస్యలకు జనరల్, ఇతర సివిల్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. దీంతో అక్కడ సేవలు భారంగా మారాయి. ప్రస్తుతం ఎక్కడి సేవలు అక్కడే అందేలా చర్యలు చేపడుతున్నాం. పల్లె, బస్తీ దవాఖానాల్లో పేదలకు మెరుగైన వైద్యం అందించేలా చూస్తాం. మంగళవారం జిల్లాకేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు ప్రారంభిస్తాం. పల్లె దవాఖానాలకు సైతం శాశ్వత భవనాలు నిర్మాణం అవుతున్నాయి.

– భాస్కర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ

క్లుప్తంగా

తలపై నుంచి వెళ్లిన ట్రాక్టర్.. వ్యక్తి దుర్మరణం

గోపాల్‌పేట: ఏదుట్ల, గోపాల్‌పేట మధ్యన ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ వ్యక్తి తలపై నుంచి ట్రాక్టరు వెళ్లడంతో తల పగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం 10గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. రేవల్లి మండలంలోని కొంకలపల్లికి చెందిన బొక్కలయ్య కొన్నాళ్ల క్రితం ట్రాక్టర్ కొన్నాడు. సోమవారం వనపర్తిలో రిజిస్ట్రేషన్ చేయించడానికి కొంకలపల్లి గ్రామం నుంచి వనపర్తికి బయల్దేరాడు. కోడేరు మండలంలోని జనుంపల్లికి చెందిన ఉబ్బసరం శేఖర్(30) వనపర్తిలో మినరల్ వాటర్ ట్యాంకర్ డ్రైవరుగా పనిచేస్తున్నాడు. సోమవారం పని నిమిత్తం వనపర్తికి బయల్దేరాడు. సుమారు ఉదయం 10:30 గంటల సమయంలో ట్రాక్టరు ఏదుట్ల, గోపాల్‌పేట మధ్యలో వెళుతుండగా ఉబ్బసరం శేఖర్ బైకును ట్రాక్టరు పక్కనుంచి ఢీకొంది. ఈ క్రమంలో శేఖర్ బైకు పైనుంచి ట్రాక్టర్ ట్రాలీ టైరుకింద పడిపోయాడు. తలపై నుంచి టైరు వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లి బాడీని వనపర్తికి పంపారు. మృతుని తమ్ముడు శ్రీను ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. ఉబ్బసరం శేఖర్‌కు భార్య, కుమారుడు ఉన్నాడు.

మరో ప్రమాదంలో చిన్నారి..

ఆత్మకూర్: ఆరుబయట ఆడుకుంటున్న చిన్నారిని ప్రమాదవశాత్తు ట్రాక్టర్ చిదిమేసిన సంఘటన సోమవారం ఆత్మకూర్ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మహ్మద్ అంజద్ తెలిపిన వివరాలు.. మండలంలోని కత్తేపల్లికి చెందిన ఆంజనేయులుకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మణివర్ధన్(4) ఆరుబయట ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైరుకింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ వినోద్ మృతిచెందిన చిన్నారికి చిన్నాన్న అని, తన తమ్ముడి అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

గడ్డి ట్రాక్టర్‌పై నుంచి పడి వృద్ధుడి మృతి


జంగయ్యగౌడు (ఫైల్)

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో చెందిన కొమ్ముగోని జంగయ్యగౌడు(60) సోమవారం సాయంత్రం గడ్డి ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. గ్రామంలో గడ్డిని ట్రాక్టర్‌లో నింపడానికి కూలీలతో కలిసి వెళ్లి ప్రమాదవశాత్తు పైనుంచి పడ్డాడు. గమనించిన తోటి కూలీలు పైకి లేపగా, ఛాతిలో నొప్పిగా ఉందనడంతో ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసే సరికి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వైద్యులను సంప్రదించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతునికి భార్య జయమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలిక..

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పదస్థితిలో ఇంట్లో ఉరివేసుకుని ఓ బాలిక(14) మృతిచెందింది. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో సోమవారం చోటుచేసుకుంది. ఆ వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మైనర్‌బాలిక ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గమనించి, వెంటనే జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై విజయ్‌కుమార్‌ను వివరణ కోరగా, కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయలేదని తెలిపారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని చెప్పారు.

పిన్నంచర్లలో చోరీ

ఆత్మకూర్: తాళం వేసిన ఇంటికి కన్నం వేశారు దొంగలు. తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి నాలుగు తులాల బంగారు నగలు, రూ.50 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఎస్‌ఐ మహ్మద్ అంజద్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పిన్నంచర్లలో ఉక్కపోత భరించలేక కతలన్న, కుటుంబ సభ్యులు మిద్దెపై నిద్రించారు. ఇంటికి తాళం ఉండడాన్ని గమనించిన దొంగలు తాళం పగలగొట్టి బీరువాలోని నగదు, నగలు ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

జూరాలకు స్వల్ప ఇన్‌ఫ్లో

ధరూరు/ మదనాపురం/దోమలపెంట: జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం సోమవారం 849 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 7.933 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 178 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

■ రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,019 అడుగులకు చేరింది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వదిలామని ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

■ శ్రీశైలం జలాశయంలో సోమవారం సాయంత్రం 809.9 అడుగుల నీటిమట్టం, 34.2 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు నీటి విడుదల చేయలేదు.

దద్దరిల్లిన కందనూలు


కలెక్టరేట్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు

- మాజీ మంత్రి జూపల్లి ఆధ్వర్యంలో రైతుల ధర్నా
- పట్టించుకోని అధికారులు..
- కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- జూపల్లితో సహా వందలాది మంది అరెస్ట్


జూపల్లి, అనుచరులను అరెస్ట్ చేసి వాహనంలో తరలిస్తున్న పోలీసులు

కందనూలు: వడ్ల కొనుగోలులో తరుగు పేరుతో మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై చేస్తున్న దోపిడి అడ్డుకట్టా వేయాలని డిమాడ్ చేస్తూ మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో సోమవారం రైతులు వందల సంఖ్యల్లో కలెక్టరేట్‌కు రావడంతో టెన్షన్ వాతావరణం నెలకొంది. జూపల్లి అనుచరులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కలెక్టర్ వచ్చేదాక కదిలేది లేదని భీష్మించుకుని కూర్చున్నారు. పరిస్థితులు అంచనా వేసిన పోలీసులు ఉన్నతాధికారులకు విషయం చేరవేశారు. అదనపు కలెక్టర్ మోతిలాల్ వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వినలేదు. గత్యంతరం లేక అదనపు కలెక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. అధికారులు స్పందించకపోవడంతో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉన్న విషయం తెలుసుకున్న వారు ర్యాలీగా బయలుదేరారు. పెద్ద సంఖ్యలో వచ్చిన పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జూపల్లితో సహా, ఆయన వర్గీయులు ప్రధాన రోడ్డుపై కూర్చొని రాస్తారోకో చేశారు. దీంతో పోలీసులు వారందరినీ అరెస్ట్ చేసి తెలకపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

దోపిడీని సహించం: జూపల్లి

కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి జూపల్లికృష్ణారావు మాట్లాడుతూ.. అష్ట, కష్టాలు పడి రైతులు పంటలు పండిస్తే అకాల వర్షాలు దెబ్బతీశాయి. ఇది చాలదు అన్నట్లుగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తాలు, తరుగు పేరుతో క్వింటాల్‌కు 15 కిలోల తరుగుతీస్తున్నారని ఆరోపించారు. రైతు ప్రభుత్వం అంటూనే నట్టేట ముంచుతున్నారని విమర్శించారు. పరిపాలన సౌలభ్యం కోసం, ప్రజలకు ప్రభుత్వం చేరువ కావడానికి చిన్న జిల్లాలు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పారు. కూత వేస్తే చాలు రైతులు, ప్రజల సమస్యలు ఇట్టే పరిష్కారం అవుతాయి అన్నారు. పరిపాలన కోసం పెద్ద పెద్ద బంగ్లాలు కట్టారు. ఇవి అన్ని దేనికోసం? రైతులను, బీదలను దోచుకోవడానికేనా? అని ప్రశ్నించారు. అవినీతి అధికారుల్లారా.. మీకు జీతాలు సరిపోడం లేదంటే.. తలా ఇంత దానం చేస్తామని, బిక్షాటన చేసుకోండని మండిపడ్డారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు రైతులకు న్యాయం చేయలేని మీకు ఆ పదవులు ఎందుకని ప్రశ్నించారు. మోసపూరిత ప్రభుత్వంలో మీ కష్టాన్ని దోచుకునేలా వరి ధాన్యం తరుగు తీసే వారి గల్లా పట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు. ధర్నా చేస్తున్న కలెక్టర్ స్పందించకుండా వీసీలో ఉన్నామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

రైతులను దోచుకుంటున్న ప్రభుత్వం

తెలకపల్లి: రైతులను ప్రభుత్వం నిలువునా దోచుకుంటుందని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. రైతులను నిలువునా దోపిడి చేసి ప్రభుత్వం, అధికారులు పంచుకుంటున్నారని ఆయన విమర్శించారు. రైతుల వద్ద నుంచి వరిధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రశీదులు ఇవ్వాలని, వాటిని ఇవ్వకుండా తిప్పుకుంటున్నారన్నారు. రైతులకు అన్యాయం చేస్తున్నా మార్కెట్ కమిటీ చైర్మన్‌పై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇంత దోపిడీ చేస్తున్నా ప్రభుత్వం సంబరాలు చేసుకుంటుందన్నారు. ఈ సంబరాలు ఎవరి కోసం అని ప్రశ్నించారు. పాలన మొత్తం విఫలమైందని, డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఫెయిల్ అయ్యాయన్నారు. ప్రజాప్రతినిధులు గ్రామాలకు వస్తే రైతులు వారిని నిలదీయాలని ఆయన పిలుపునిచ్చారు. సొంత పూచికత్తుపై జూపల్లి విడుదలయినట్లు పోలీసులు తెలిపారు. కాగా విషయం తెలుసుకున్న ఆయన వర్గీయులు, అభిమానులు పోలీస్‌స్టేషన్‌కు పెద్ద ఎత్తున వచ్చి ఆయనను కలిశారు.

లెక్క తప్పిన 'లెక్కల మాస్టర్'

- చిట్‌ఫండ్ పేరిట రూ.3 కోట్ల టోకరా
- అజ్ఞాతంలోకి వెళ్లిన వైనం

గద్వాల క్రైం: మంచి పరిచయాలతో బంధువులు, స్నేహితులు, సహచర ఉపాధ్యాయులతో చిన్నపాటి వడ్డీ వ్యాపారం, చిట్‌ఫండ్ నిర్వహిస్తూ అందరికి నమ్మకంగా మెలిగాడు. చివరకు టోకరా పెట్టి అజ్ఞాతంలోకి వెళ్లిన సంఘటన జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. అయిజ మండలం ఉప్పాలకు చెందిన వ్యక్తి గద్వాల మండలంలోని కాకులారం ప్రభుత్వ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. కొంతకాలంగా వ్యాపారం చేస్తూ పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్నాడు. వ్యాపారంలో అందరికీ నమ్మకంగా ఉంటూ వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. దీంతో చిట్‌ఫండ్ నిర్వహిస్తూ చాలా మంది సభ్యులను చేర్చుకున్నారు. అందరి నుంచి దాదాపు రూ.3 కోట్ల వరకు వసూలు చేశాడు. చీటి కాలపరిమితి పూర్తయిన వారు డబ్బుల కోసం అడుగుతూ వచ్చారు. రేపు, మాపంటూ దాటవేస్తూ తీరా.. అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో కొందరు మోసపోయినట్లు గుర్తించి వారి బంధువులు, స్నేహితులను వాకాబు చేసినా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో ఎవరికి చెప్పుకోలేక మదనపడుతున్నారు. ఈ విషయం పలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొట్టింది. ఘటనపై పట్టణ ఎస్‌ఐ రామస్వామిని వివరణ కోరగా.. ఎవరైన బాధితులు ఫిర్యాదు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని, ఇంత వరకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన దేశభక్తి


భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగ్‌మోహన్‌సింగ్ తదితరులు

- పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్, భగత్‌సింగ్ మేనల్లుడు జగ్‌మోహన్‌సింగ్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్/ నారాయణపేట: సామ్రాజ్యవాద వ్యతిరేకతే నిజమైన దేశభక్తి అని భగత్‌సింగ్ మేనల్లుడు, పంజాబ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జగ్‌మోహన్‌సింగ్ అన్నారు. సోమవారం ఆయన మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో పర్యటించారు. ముందుగా మహబూబ్‌నగర్ సమీపంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ స్వతంత్రోద్యమంలో తన మేనమామ భగత్‌సింగ్ నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తారని కొనియాడారు. ఉద్యమ సమయంలో అన్ని మతాల వారు కలిసికట్టుగా పండగలు జరుపుకొంటే దానిని చూసి భయపడిన బ్రిటీష్ వారు జలియన్‌వాలా భాగ్ హింసాత్మక ఘటనకు పాల్పడ్డారని, మతం అంటే అర్థం ప్రేమ, పరస్పర సహకారం, ఇతరులను అర్థం చేసుకోవడం అన్నారు. ఈ అంశాలను ప్రస్తుతం యువత గమనించాల్సిన అవసరం ఉందన్నారు. భగత్‌సింగ్ దృష్టిలో ఆడ, మగ సమానం అని, ఉద్యోగాల్లో మహిళలకు సైతం సమాన అవకాశాలు కల్పించాలని, ఆపదలో ఉన్న వారికి సహకారం అందించాలనేది భగత్‌సింగ్ ఉద్దేశం అన్నారు. కేవలం ఇంటి వద్ద తయారు చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని, బయటి ఆహారం తీసుకోవడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని, లక్ష్యం చేరేందుకు శ్రమించి చదవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ రవికుమార్, కార్యదర్శి వెంకటరామారావు, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

■ నారాయణపేటలోని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యాలయం, భగత్‌సింగ్ భవన్‌లో ప్రజాపంథా పార్టీ జిల్లా కార్యదర్శి రాము అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జగ్‌మోహన్‌సింగ్‌తోపాటు రాష్ట్ర కార్యదర్శి పి.రంగారావు మాట్లాడుతూ దేశంలో ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ వేగవంతం చేసి అనేక ఆర్థిక సంస్కరణలు చేపడుతున్నారన్నారు. దీంతో అనేక రంగాల్లో యువత ఉపాధి అవకాశాలను కోల్పోయిందన్నారు. రూ.లక్షల కోట్లు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. భగత్‌సింగ్ కలలు కన్న కార్మిక, కర్షక రాజ్యం రాలేదన్నారు. ప్రపంచంలోనే అత్యధిక పేదలు మన దేశంలోనే మూడు పూటలా తిండి లేక ఆకలితో అలమటిస్తున్నారని, కరోనా కంటే ఆకలి చావులే ఎక్కువగా ఉన్నాయన్నారు. దేశాన్ని పాలించే మతోన్మాద శక్తులు పేదల కోసం కాకుండా పెట్టుబడి దారుల పక్షాన నిలబడుతున్నాయన్నారు. దీనికి వ్యతిరేకంగా యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని పోరాడాలన్నారు. సమావేశంలో నాయకులు రామచందర్, హన్మేశ్‌చారీ, సీహెచ్ రామచందర్, కాశీనాథ్, యాదగిరి, జయలక్ష్మి, నర్సింహులు, ప్రశాంత్, కె.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణకు పాటుపడాలి


మొక్క నాటుతున్న జీవవైవిధ్య మండలి ప్రధాన కార్యదర్శి కాళీ చరణ్ కథర్డే, తదితరులు

జడ్చర్ల: జీవవైవిధ్య పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ప్రధాన కార్యదర్శి కాళీచరణ్ కథర్డే పిలుపునిచ్చారు. సోమవారం ఆయన స్థానిక బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ బొటానికల్ గార్డెన్‌ను సందర్శించారు. తెలంగాణలో అంతరించిపోతున్న మొక్కల సంరక్షణకు బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలియజేశారు. జీవ వైవిధ్యం కాపాడటం ప్రతిఒక్కరి బాధ్యతగా గుర్తెరుగాలని, మన జీవన విధానంలో ఓ భాగంగా అలవరచుకోవాలన్నారు. అదేవిధంగా రీజియన్ కోఆర్డినేటర్ శిల్పిశర్మ మాట్లాడారు. అంతరించిపోతున్న అరుదైన మొక్కలను సంరక్షించడానికి జడ్చర్లలోని తెలంగాణ బొటానికల్ గార్డెన్ అనుకూలంగా ఉందన్నారు. తెలంగాణలో జీవవైవిధ్య రిజిస్ట్రార్ నమోదు చేయడంలో ఈ కళాశాల విద్యార్థులు పాల్గొనడం గర్వంగా ఉందన్నారు. ఇప్పటికే అంతరించిపోతున్న దాదాపు 20 మొక్కలను గార్డెన్‌లో సంరక్షిస్తున్నామని గార్డెన్ నిర్వాహకులు సదాశివయ్య ఈ సందర్భంగా వారి దృష్టికి తీసుకురావడంతో వారు అభినందించారు. అంతకు ముందు గార్డెన్‌లో వారు మొక్కలు నాటి గార్డెన్‌లోని మొక్కలను పరిశీలించారు. సమావేశంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి శ్రీనువాసులు, కౌన్సిలర్ సతీష్, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం



నవాబుపేట: మండలంలోని కారుకొండకి చెందిన వ్యక్తి వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పథకం సొంతం చేసుకున్నాడు. ఈ నెల 27, 28వ తేదీల్లో హైదరాబాద్‌లోని చిక్కడ్‌పల్లిలో జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 35 ఏళ్ల వయస్సు విభాగం 61 కిలోల విభాగంలో 130 కిలోల బరువు ఎత్తి కారుకొండకి చెందిన మల్లెపల్లి ఆనంద్‌కుమార్ బంగారు పథకం సాధించాడు. కాగా మాస్టర్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన టోర్నీలో ఆనంద్‌కుమార్ విజేతగా నిలిచి బంగారు పథకం పొందాడు. కాగా ఆనంద్ గత నెల ఏప్రిల్‌లో రాష్ట్ర స్థాయి, దక్షిణ భారత దేశ స్థాయిలో విజేతగా నిలిచి తాజాగా జాతీయ స్థాయిలో బంగారు పథకం సొంతం చేసుకున్నాడు. విజేత ఆనంద్‌కు వెయిట్ లిఫ్టింగ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శృతిరావు, రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజ్ బంగారు పథకం, ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా విజేతను మండల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, అధికారులు తదితరులు అభినందించారు.

పీఎఫ్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయండి



వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫోరం సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లాకేంద్రంలో కేంద్ర ప్రావిడెండ్‌ఫండ్ (పీఎఫ్) కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర పీఎఫ్ నోడల్ ఆఫీసర్ రమేష్ చావాను ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎ.రాజసింహుడు విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్‌లోని పారిశ్రామికవాడలోని ఫోరం కార్యాలయంలో సోమవారం జరిగిన ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, ఈపీఎఫ్ పెన్షనర్లు, పీఎఫ్ సభ్యులు లక్షకు పైగానే ఉన్నారని, ఈ వయస్సులో హైదరాబాద్‌లోని బర్కత్‌పుర పీఎఫ్ కార్యాలయానికి వెళ్లాలంటే ఆర్థిక, శారీరక ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. అనంతరం నోడల్ ఆఫీసర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నోడల్ ఆఫీసర్ రమేష్ చావా మాట్లాడుతూ కార్యాలయ ఏర్పాటుకు పీఎఫ్ కమిషనర్‌తో మాట్లాడి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీఎఫ్ ఖాతాదారుల సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తామని అన్నారు. సమావేశంలో ఫోరం సభ్యులు నారాయణ, జీబీ.పాల్, మోహన్‌రెడ్డి, నాగాంజనేయులు, మల్లికార్జున్, బషీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

క్షణికావేశంలో బైక్‌కు నిప్పు

- మంటలను ఆర్పివేసిన ఫైర్ అధికారులు


పోలీస్‌స్టేషన్ ఎదుట దగ్ధమవుతున్న బైక్

నాగర్‌కర్నూల్ క్రైం: ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన వ్యక్తిగత ఘర్షణలో మరో వ్యక్తి క్షణికావేశంలో ద్విచక్ర వాహనంపై పెట్రోల్ పోసి నిప్పంటించిన సంఘటన జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. లింగాల మండలంలోని అప్పాయిపల్లికి చెందిన మహేష్‌కు, లింగాల మండలంలోని ధారారానికి చెందిన ముత్యాలుకు సోమవారం ఉదయం శ్రీపురం రోడ్డులో ఓ మహిళ విషయంలో ఘర్షణ చోటుచేసుకుంది. మహేష్ కర్రతో ముత్యాలుపై దాడి చేశాడు. ముత్యాలు తలకు గాయమైంది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే ఘర్షణ విషయం ముత్యాలు కొడుకు సాయికి తెలియడంతో పోలీస్ స్టేషన్ ముందు నిలిపి ఉంచిన మహేష్ ద్విచక్ర వాహనంపైన పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ద్విచక్ర వాహనం దగ్ధం అవుతుండడంతో గమనించిన స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో ఫైర్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు సంఘటనకు సంబంధించి ఎస్‌ఐ విజయ్ కుమార్ ని వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. కాగా ముత్యాలు నాగర్‌కర్నూల్‌లో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు.

రెండు గడ్డివాములు దగ్ధం



మరికల్: మండలంలోని వెంకటాపూర్ శివారులో సోమవారం రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. లక్ష్మారెడ్డి, హన్మంతురెడ్డి పొలంలో ఓ పక్కకు పశువుల కోసం గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. వరికోత వేసిన పొలంలో కొందరు నిప్పుపెట్టారు. ఈదురు గాలులకు మంటలు చేలరేగడంతో రెండు గడ్డివాములు పూర్తిగా దగ్ధమయ్యాయి. 7 ఎకరాల పశుగ్రాసం దగ్ధం కావడంతో రూ.60 వేల నష్టం వాటిల్లిందని, ఇద్దరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

శివపార్వతుల పంచలోహ విగ్రహాలు చోరీ


చోరీ జరిగిన ఆలయంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పాన్‌గల్: శివాలయంలో చోరీ జరిగిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండలం కదిరెపాడు గురిగింజ మిట్ట తండాలోని శివాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు గర్భగుడి తాళం ధ్వంసం చేసి ఆలయంలోని రెండు శివపార్వతుల పంచ లోహ విగ్రహాలు, రాగి బిందె, కంచు బిందె, రాగి చెంబు, రెండు రాగి గ్లాసులు, నాలుగు కంచు ప్లేట్లు, రాగి శఠగోపం, హారతి పళ్లెం, మూడు కంచు దీపాలు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం క్లూస్ టీం తండాలోని ఆలయంలో వివరాలు సేకరించినట్లు పేర్కొన్నారు. ఆలయ పూజారి కొర్రవత్ దేవమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని స్టేషన్ హెచ్‌సీ రాంచందర్ తెలియజేశారు.

నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం


పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు

మరికల్: మండలంలోని బూడ్యాగానితండాలో నిల్వ ఉంచిన నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బూడ్యాగాని తండాకు చెందిన లింబ్యా నాయక్ ఇంట్లో 50 కిలోలు, మెగ్యనాయక్ ఇంట్లో 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వ్యవసాయ అధికారుల పంచనామా తర్వాత కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సారా పట్టివేత

బూడ్యాగానితండాలో లక్ష్మమ్మ ఇంట్లో ఐదు లీటర్ల సారా, మూడు బకెట్ల బెల్లం పాకం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఓవర్‌టేక్ చేయబోయి.. బైక్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరు యువకుల మృతి
- రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద ఘటన

చేవెళ్ల: ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరగిద్ద బస్టాప్‌కు సమీపంలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దౌల్తాబాద్‌లో జాతర ముగించుకొని పల్సర్ బైక్ వస్తున్న ఇద్దరు యువకులు చేవెళ్ల మండలం దామరగిద్ద బస్టాండ్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా ఎదురుగా చేవెళ్ల వైపు నుంచి వస్తున్న తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం వేపూర్ గ్రామానికి చెందిన కోస్గి చంద్రశేఖర్ (23), వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం ఎక్మాయి గ్రామానికి చెందిన ఎస్. నరేశ్(17) అక్కడికక్కడే మృతి చెందారు. వీరివురు వరుసకు దూరపు బంధువులు అవుతారు. చంద్రశేఖర్ శంషాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా.. నరేశ్ శంషాబాద్‌కు సమీపంలో ఇంటర్ చదువుతున్నాడు. మృతదేహాలను చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా, బెల్లం పట్టివేత


బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

అమ్రాబాద్: మండలంలోని తిర్మలాపూర్(బీకే), ఉప్పునుంతల(బీకే)లో సోమవారం ఎక్సైజ్, పోలీసులు సమష్టిగా దాడులు నిర్వహించారు. 18లీటర్ల సారా, 150కిలోల నల్లబెల్లం, 30కిలోల పటిక స్వాధీనం చేసుకోవడంతో పాటు సారా తయారీకి సిద్ధం చేసిన 530 లీటర్ల బెల్లం పానం ధ్వంసం చేశారు. ఇద్దరి పై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. దాడులలో అమ్రాబాద్ ఎస్‌ఐ వీరబాబు, ఎక్సైజ్ ఎస్‌ఐలు బాల్‌రాజు, సత్యం పాల్గొన్నారు.